సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 8 । జనవరి । 2023



ఖండేవ్ సన్నిధిలో మహాపూజ

పుష్య పౌర్ణమి పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తొడసం వంశీయులు సంప్రదాయం ప్రకారం ఖండేవునికి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. 10లో▸

'ఓపెన్'లో స్పెషల్ అడ్మిషన్లు

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో స్పెషల్ అడ్మిషన్లు ఈనెల 9 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్ ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలు పొందేవారు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి సంబంధిత అధ్యయన కేంద్రంలో ఫారం సమర్పించాలని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
27.0/10.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచుతో పాటు రాత్రివేళలో చలి ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు 'నూతన' శుభాకాంక్షలు



బ్లాంకెట్లు అందజేసి శుభాకాంక్షలు చెబుతూ..

కైలాస్‌నగర్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు శనివారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిశారు. పుష్పగుచ్ఛం, బ్లాంకెట్లను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్ శివకుమార్, సలహాదారు రాజేందర్ దేశ్‌పాండే తదితరులున్నారు.

మహిళల అభ్యున్నతికి పాటుపడాలి

ఎదులాపురం: మహిళా ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వాలు కృషి చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ముడుపు నళినిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సమాఖ్య జిల్లా విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. మహిళలు ఆర్థికంగా ఎగిదేలా కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం అందించాలన్నారు. బెల్టు షాపులు మూసివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకురాళ్లు చంద్రకళ, వినోద, అమీనా, సంగీత, గంగమ్మ, రామక్క తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే మంచి భవిష్యత్



మాట్లాడుతున్న డీఈఐవో రవీందర్

ఇంద్రవెల్లి: విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని డీఐఈవో రవీందర్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులతో పాటు విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. సిలబస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎంసెట్, నీట్ శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారి వెంట ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, అధ్యాపకులు ఉన్నారు.

ఫర్‌చేంజ్ యాత్రను విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న జిల్లా నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 26న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ఫర్ చేంజ్ హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మన్ సిద్మకి ఆనంద్ కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లాకు చెందిన పలువురు పాల్గొన్నారు. యాత్రకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ నరేష్ జాదవ్, టీపీసీసీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు భరత్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర చేపడుతున్న కీర్తి నాయుడు

నేరడిగొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన గోప్లే కీర్తి నాయుడు చేపట్టిన సైకిల్‌యాత్ర శనివారం నేరడిగొండకు చేరుకుంది. ఈయన జనవరి 1న ప్రకాశం నుంచి ఈ యాత్ర ప్రారంభించాడు. నేరడిగొండకు సాయంత్రం చేరుకోగా స్థానిక యువకులు స్వాగతం పలికారు. ఫిబ్రవరి 14ను వీర జవాన్ల దినోత్సవం జరుపుకుందామని, అమర జవాన్ల త్యాగాలను స్మరించుకుందామని కోరుతూ ఢిల్లీ వరకు ఈ యాత్ర చేపట్టినట్లు ఆయన తెలిపాడు.



విద్యుత్ సబ్‌స్టేషన్

ఏసీడీ.. పిడుగు



ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీకి గుమ్మడి రమేశ్ తన నివాస విద్యుత్ కనెక్షన్‌కు 28 రోజులకు గాను 90 యూనిట్లు వినియోగించాడు. దీనికి గాను విద్యుత్ వినియోగ చార్జీ కింద రూ.338, అలాగే ఏసీడీ కింద రూ.1,538 అదనంగా వేసి బిల్లు జారీ చేశారు ఆ శాఖ సిబ్బంది. ఒక్కసారిగా అంత బిల్లు చూసి ఖంగుతినడం అతడి వంతయింది.



పట్టణంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన గంట వినోద్ తన ఇంటి విద్యుత్ కనెక్షన్‌కు 34 రోజులకు గాను 401 యూనిట్ల విద్యుత్ వాడారు. దీనికి గాను వినియోగచార్జీల కింద రూ.2,571, ఏసీడీ చార్జీల కింద రూ.4,222 అదనంగా వేసి ఈ నెలలో బిల్లు అందజేశారు. వాడిన చార్జీల కంటే అదనంగా వచ్చిన బిల్లును చూసి సదరు వినియోగదారుడు అవాక్కయ్యాడు.

ఇది కొత్తదేమీ కాదు..



ఏసీడీ చార్జీలు కొత్తవేమి కావు. విద్యుత్ వ్యవస్థ పుట్టినప్పటి నుంచి ఉంది. సర్వీస్ తీసుకున్నప్పుడు ఒక కిలో వాట్ తీసుకుని దానికంటే అధిక విద్యుత్ వినియోగిస్తేనే ఈ చార్జీలు పడుతాయి. అంతే తప్ప అడిషనల్ బిల్లులేమీ రావు. మూడు నెలల విద్యుత్ వినియోగాన్ని చూసి ఏసీడీ చార్జీలు వేస్తున్నారు. ఇది అడిషనల్ డిపాజిట్ మాత్రమే. దీనిపై వినియోగదారులకు ప్రతి నెలా వడ్డీ కూడా వస్తుంది. కనుక ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– కె.సంపత్‌కుమార్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ

- విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం
- వేలల్లో బిల్లులు చూసి కంగుతింటున్న వైనం
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

జిల్లాలో మొత్తం విద్యుత్ కనెక్షన్లు: 2,62,868
వంద యూనిట్లలోపు వినియోగించే కనెక్షన్లు : 45,034

కైలాస్‌నగర్: జిల్లాలోని విద్యుత్ వినియోగదారులపై ఏసీడీ ద్యూ (అడిషనల్ కన్జమ్షన్ డిపాజిట్) పేరిట మరో పిడుగు పడింది. గతేడాది కస్టమర్ డెవలప్‌మెంట్ చార్జీల పేరిట వేలాది రూపాయల అదనపు బిల్లులను వసూలు చేసిన విద్యుత్ శాఖ తాజాగా నూతన సంవత్సరం మొదటి నెలలోనే వినియోగదారులపై ఏసీడీ ద్యూ పేరిట మరింత భారం మోపేందుకు సిద్ధమైంది. వినియోగించిన యూనిట్లతో సంబంధం లేదు.. వినియోగదారుడైతే చాలు అన్నట్లుగా ఎడాపెడా అదనపు బాదుడుకు రంగం సిద్ధం చేసింది. జనవరిలో అందుకున్న బిల్లులను చూసిన వినియోగదారులకు షాక్ తగిలినంత పనైంది. అదనపు బిల్లులు ఎందుకు వచ్చిందో తెలియక వినియోగదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఏసీడీ ద్యూ అంటే...

ఏసీడీ (అడిషనల్ కన్జమ్షన్ డిపాజిట్) ఈ పదం ప్రస్తుతం విద్యుత్ వినియోగదారులను బెంబేలెత్తిస్తుంది. ఏసీడీ చార్జీలు ఎందుకు వచ్చాయో తెలియక చాలామంది ఆందోళనకు గురువుతున్నారు. ఈ బిల్లులు తగ్గించాలని కోరుతూ ఆ శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. విద్యుత్ సర్వీస్ తీసుకున్న సమయంలో వారు వినియోగించే విద్యుత్ అవసరాలు దృష్టిలో ఉంచుకుని ఒకటి లేదా రెండు కిలోవాట్ల సామర్థ్యంతో కనెక్షన్ తీసుకుంటారు. దాని ప్రకారం అధికారులు డిపాజిట్ తీసుకుని మీటర్లు అమర్చుతారు. అనుమతి కలిగిన దానికంటే ఎక్కువ విద్యుత్ వినియోగించినట్లు తేలితే ఏసీడీ డిపాజిట్ నగదు పెంచుతారు. గతంలో నెలకు 300 యూనిట్లు దాటితే ఏసీడీ కింద అదనపు నగదు వసూలు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిమితిని పూర్తిగా ఎత్తేశారు. దీంతో ప్రతి ఒక్కరికి ఏసీడీ బాదుడు తప్పడం లేదు. వినియోగించిన విద్యుత్ యూనిట్లకనుగుణంగా లెక్కగట్టి బిల్లులో ఏసీడీ ద్యూ చార్జీలను వేస్తున్నారు.

లబోదిబోమంటున్న వినియోగదారులు

300 యూనిట్ల వినియోగం దాటితేనే ఏసీడీ ద్యూ చార్జీలు వస్తాయని విద్యుత్ అధికారులు చెబుతున్నప్పటికి అంతకంటే తక్కువగా వినియోగించిన వారికి కూడా ఆ చార్జీలను విధిస్తున్నారు. గతంలో కేటగిరి 2లోని వాణిజ్యపరమైన కనెక్షన్లకు విద్యుత్ వినియోగం పెరిగి ఏ విధంగా అదనపు బిల్లులు వేశారో ప్రస్తుతం నివాస గృహాలకు సైతం అదే విధానాన్ని అమలు చేస్తున్నారు. అనుమతి పొందిన యూనిట్ల కంటే ఎక్కువ వినియోగించిన వారికి గతేడాది కస్టమర్ డెవలప్‌మెంట్ చార్జీల(సీడీసీ) పేరిట అదనపు భారం మోపింది. ఈ చార్జీలు ఒక్కొక్కరికి రూ.3వేల నుంచి రూ.10వేల వరకు బిల్లు రావడంతో ఆందోళనకు గురయ్యారు. ఇదిలా ఉంటే తాజాగా నూతన సంవత్సరం తొలి నెలలోనే ఏసీడీ ద్యూపేరిట వినియోగదారులపై విద్యుత్ శాఖ అదనపు భారం మోపుతోంది. వినియోగంతో సంబంధం లేకుండా వేలల్లో బిల్లులు రావడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. అదనంగా వచ్చిన బిల్లులు దేనికని తెలుసుకునేందుకు అధికారులను సంప్రదిస్తే, వాటిని తప్పనిసరిగా చెల్లించాలని చెబుతుండటంతో ఆందోళనకు గురవుతున్నారు. ఈ నెల బిల్లును పొందిన వారిలో అత్యధికంగా ఏసీడీ ద్యూ అదనపు బిల్లులు ఇవ్వడంతో వారిపై తీవ్ర భారం పడతుంది.

పరేషన్!

- వారం దాటినా ఇంకా అందని రేషన్ బియ్యం
- కార్డుదారులకు తప్పని ఎదురుచూపు
- సందిగ్ధంలో 'ప్రజా పంపిణీ'

సమాచారం..	
జిల్లాలో రేషన్ షాపులు	356
రేషన్ కార్డులు	1,92,078
బియ్యం పొందేవారి మొత్తం యూనిట్లు	6,42,469
ప్రతి నెలా కేటాయించే బియ్యం	3494.375 మెట్రిక్ టన్నులు



బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

కైలాస్‌నగర్: ప్రజా పంపిణీ వ్యవస్థపై సందిగ్ధం నెలకొంది. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన రేషన్ బియ్యం పంపిణీ ఈనెల 8వ తేదీ వచ్చినా ఇంకా షురూ కాలేదు. ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారనే దానిపై కూడా సంబంధితాధికారుల్లో స్పష్టత లేదు. ఓ వైపు సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో బియ్యం కోసం కార్డుదారులు నిరీక్షిస్తున్నారు. ఇప్పటికే బియ్యం షాపులకు చేరుకున్నా పంపిణీపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో డీలర్లు సైతం ఏం చేయలేకపోతున్నారు. ప్రభుత్వ నిర్ణయం కోసం వారంతా ఎదురుచూస్తున్నారు.

కేటాయింపులు నిలిపివేసిన రాష్ట్ర ప్రభుత్వం

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఫుడ్ సెక్యూరిటీ కార్డుదారులందరికీ యూనిట్‌కు 6 కిలోల చొప్పున బియ్యం అందజేస్తోంది. కరోనా తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో ఉపాధి లేక పేదలు తిండికి ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2020 ఏప్రిల్ నుంచి ఒక్కో యూనిట్‌కు ఐదు కిలోల చొప్పున రేషన్ బియ్యం ఉచితంగా అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సైతం కేంద్రం నిర్ణయాన్ని సమర్థిస్తూ తమ వాటాగా మరో ఐదు కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తోంది. తాజాగా గత నెలలో సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఉచిత బియ్యం పంపిణీని మరో ఏడాది పాటు (డిసెంబర్ 2023) వరకు పొడిగించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తమ వాటాగా అందించాల్సిన ఐదు కిలోల బియ్యంకు సంబంధించిన కేటాయింపులు చేయకపోవడం గమనార్హం.

స్పష్టత కరవు

కేంద్రం కేటాయించిన ఐదు కిలోల బియ్యంనే కార్డుదారులకు అందించాలని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం తొలుత పౌరసరఫరాలశాఖ అధికారులను ఆదేశించింది. తదనుగుణంగా జిల్లాల వారీగా కేటాయింపులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు జిల్లా అధికారులు రేషన్‌షాపులకు బియ్యం కేటాయింపులు చేశారు. ఆయా షాపు పరిధిలోని కార్డుదారులకు అవసరమైన బియ్యం సరఫరా చేశారు. ఈ నెల ఐదో తేదీ నుంచి బియ్యం పంపిణీ ప్రారంభిస్తామని ప్రకటించారు. తీరా సాంకేతిక సమస్యల కారణంగా పేర్కొంటూ 7వ తేదీ నుంచి బియ్యం పంపిణీ చేస్తామని వెల్లడించారు. అయితే బియ్యం పంపిణీని చేపట్టవద్దంటూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన నేపథ్యంలో దాన్ని నిలిపివేశారు. తిరిగి ఎప్పటి నుంచి పంపిణీని ప్రారంభిస్తారనే దానిపై అధికారుల్లోనూ స్పష్టత లేదు. అయితే కేంద్రం ఇచ్చిన ఐదు కిలోలే ఇవ్వాలా, లేదంటే మునుపటిలానే రాష్ట్రం వాటా కేటాయింపులు చేసి పది కిలోలు యథావిధిగా ఇవ్వాలా అనే దానిపై ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఈ నెల బియ్యం పంపిణీలో ఆలస్యమవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా పండుగ వేళ రేషన్‌బియ్యం పంపిణీలో జరుగుతున్న జాప్యంతో కార్డుదారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా చర్యలు



సాంకేతిక కారణాలతో బియ్యం పంపిణీని ఇంకా ప్రారంభించలేదు. ఇప్పటికైతే ఐదు కిలోల చొప్పున బియ్యం కేటాయింపులు చేస్తూ కోటాను రేషన్ షాపుల వారీగా సరఫరా చేశాం. వాటిని కార్డుదారులకు ఎప్పుడు ఇవ్వాలని, ప్రభుత్వ ఆదేశిస్తే తదనుగుణంగా చర్యలు తీసుకుంటాం. సాంకేతిక సమస్యలు తీరగానే జిల్లాలో బియ్యం పంపిణీని చేపడుతాం.

– టి.కిరణ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

సర్వే పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: బడి బయట పిల్లల సర్వే పకడ్బందీగా చేపట్టాలని డీఈవో ప్రణీత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఈవోలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో ఈనెల 8 నుంచి 18 వరకు సర్వే చేపట్టాలని సూచించారు. 6 నుంచి 14ఏళ్లలోపు బడిబయట పిల్లల వివరాలు సేకరించాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు నిర్మాణాత్మక, సంగ్రాణాత్మక పరీక్షలకు సంబంధించిన ఫలితాలను ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో పొందుపర్చాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. సమావేశంలో సెక్టోరల్ అధికారులు నర్సయ్య, సుజాత్ ఖాన్, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను సన్నద్ధం చేయాలి

ఏప్రిల్‌లో నిర్వహించే పదో తరగతి వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను సన్నద్ధం చే యాలని డీఈవో ప్రణీత అన్నారు. సాంఘిక శాస్త్ర ఉ పాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో శనివారం ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. రాములు, బి.సంతోష్‌కుమార్, సంఘ బాధ్యులు దేవన్న, వెంకట్‌రావు, రాజేందర్,రాము తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి కార్యకర్తలే కీలకం



వర్చువల్ మీటింగ్ ద్వారా ప్రసంగిస్తున్న బండి సంజయ్



కార్యక్రమానికి హాజరైన నాయకులు కార్యకర్తలు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

ఆదిలాబాద్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి బూత్ స్థాయి కార్యకర్తలే కీలకమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. సంఘటన్ మహా విస్తార్ అభియాన్ పేరిట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన బూత్ స్థాయి కార్యకర్తల సమ్మేళనంలో వర్చువల్ ద్వారా వారు మాట్లాడారు. బూత్ స్థాయి కార్యకర్తలే పార్టీకి మూల స్తంభమన్నారు. కేంద్రం నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం దారి మళ్లిస్తుందని, ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో వివరించాలన్నారు. ఎన్నికల హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ప్రతీ పోలింగ్ బూత్‌లో నిత్యం సమావేశాలు జరగాలని, అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీజేపీ కార్యకర్తల ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తుందని, ఈ నేపథ్యంలోనే సరల్ పోర్టల్, యాప్‌లో నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పార్టీ అసెంబ్లీ ప్రభారి బద్దం లింగారెడ్డి మాట్లాడుతూ, బూత్ స్థాయి కార్యకర్తలు నిబద్ధతతో పనిచేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకత్ రమేశ్, నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, దినేష్ మటోలియా, ధోని జ్యోతి, జోగు రవి, లోకా ప్రవీణ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ విజయ్, లాలా మున్నా, సోమ రవి, సునంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడలో..

ఇచ్చోడ: రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతీ కార్యకర్త కంకణబద్ధులై పనిచేయాలని బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు, ప్రభారి సత్యనారాయణ, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన బూత్‌స్థాయి కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతీ బూత్‌లో బీజేపీ కార్యకర్తలు ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మానాజీ, జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మాదవ్ ఆమ్టె, బాబారావ్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, అసెంబ్లీ కన్వీనర్ సూర్యకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌సెంటర్లలో వసతులపై 'ఎన్‌క్వాస్' ఆరా



అందర్‌బంద్ సబ్‌సెంటర్‌లో ఎన్‌క్వాస్ బృందం

తాంసి: భీంపూర్ మండలంలోని పలు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్యూఏఎస్) బృందం సభ్యులు శనివారం పరిశీలించారు. మండలంలోని అర్లి(టి), ధనోరా, అందర్‌బంద్ గ్రామాల్లోని సబ్ సెంటర్లను బృందం మేనేజర్ అమర్‌నాథ్, ఎన్‌హెచ్ఎం అధికారి అనిల్, వైద్యసిబ్బందితో కలిసి సందర్శించారు. కేంద్రాల్లో అందిస్తున్న వైద్యసేవలు, వసతుల వివరాలపై ఆరా తీశారు. అలాగే ఆవరణలో పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. వారి వెంట భీంపూర్ ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజర్ గంగాధర్, ఏఎన్ఎంలు సుజాత, సరస్వతి, ఆశ కార్యకర్తలు, సిబ్బంది ఉన్నారు.

రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలి

- జిల్లా జడ్జి ఎంఆర్ సునీత
- ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్

ఆదిలాబాద్‌టౌన్: కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా జడ్జి ఎంఆర్ సునీత అన్నారు. కోర్టు ప్రాంగణంలో పీపీలు, పోలీసులు, న్యాయవాదులతో శని వారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడారు. జిల్లాలో ఫిబ్రవరి 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈమేరకు నెల రోజులుగా అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజీపడదగ్గ కేసులను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే క్షేత్రస్థాయిలో పోలీసులు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా మొదటి అ దనపు జడ్జి మాధవీకృష్ణ, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, జడ్జీలు, పీపీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ఎంఆర్ సునీత

క్లుప్తంగా

టైగర్‌జోన్ పరిధిలో తవ్వకాలు నిషేధం

ఇచ్చోడ(బోథ్): కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో మొరం, ఇసుక తవ్వకాలను పూర్తిగా నిషేధించినట్లు టైగర్‌జోన్ అటవీశాఖ అధికారి వాహబ్ అహ్మద్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టైగర్‌జోన్ బఫర్ ఏరియా ప్రాంతంలో అక్రమంగా దున్నడం, ఇసుక, మొర్రం తవ్వకాలు చేపట్టడాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందన్నారు. తెలంగాణ అటవీ చట్టం 1967, వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 అటవీ సంరక్షణ చట్టం ,1980, జీవవైవిధ్య చట్టం 2002 ప్రకారం అటవీ ప్రాంతంలో తవ్వకాలు చేపట్టిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

నిర్మల్‌రూరల్: మండలంలోని నీలాయిపేట వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు రూరల్ ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు. మామడ మండలం పులిమడుగుతాండకు చెందిన గణేశ్ (40) జిల్లా కేంద్రంలో కట్టెలు అమ్ముకుని సైకిల్‌పై స్వగ్రామానికి తిరిగివస్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

దొంగకు దేహశుద్ధి

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పట్టపగలే చోరీకి పాల్పడుతున్న దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఆలయ హుండీని పగులగొడుతుండగా సమీపంలోనే ఉన్న మహిళలు గమనించి అరవడంతో పారిపోయేందుకు యత్నించాడు. అతన్ని వెంబడించిన గ్రామస్తులు గంగాయిపేట్ సమీపంలో పట్టుకున్నారు. నిందితుడు కడెం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన రమేశ్‌గా గుర్తించినట్లు వారు పేర్కొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

- ముగ్గురు డిగ్రీ విద్యార్థులకు గాయాలు



గాయపడ్డ విద్యార్థిని

కడెం(ఖానాపూర్): మండలంలోని ధర్మాజీపేట్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ము గ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. దస్తురా బాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఏడుగురు, భూత్కూర్, దస్తురాబాద్ గ్రామాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఖానాపూర్‌లోని వాగ్దేవి కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. శనివారం పరీక్షలు రాసేందుకు ఆటోలో వెళ్తుండగా ధర్మాజీపేట్ వద్ద కుక్కలు అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రజిత, పూజిత, తులసీకి గాయాలు కావడంతో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఖందేవ్ సన్నిధిలో మహాపూజ



ఖందేవ్‌కు పూజలు చేస్తున్న తొడసం వంశీయులు

- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన తొడసం వంశీయులు
- ప్రత్యేక పూజలు చేసిన జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే



మొక్కుతున్న జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్



ఇంటింటా నూనె సేకరిస్తున్న ఆదివాసీ మహిళలు



సంప్రదాయబద్ధంగా పలకరిస్తున్న మహిళలు

నార్నూర్(ఆసిఫాబాద్): పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తొడసం వంశీయులు వారి ఆచారం, సంస్కృతి, సంప్రదాయం ప్రకారం శుక్రవారం రాత్రి ఖందేవునికి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. శనివారం ఆలయ ప్రాంగణంలో భేటి అయ్యారు. ఒకరికొకరు సాదక బాధకాలు తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా జివితి తాలూకాలోని కొద్దిగూడ గ్రామానికి చెందిన తొడసం ఆడపడుచు మెస్రం నాగుబాయి చందు దేవుని సన్నిధిలో రెండున్నర కిలోల నువ్వుల నూనె తాగింది. సంప్రదాయం ప్రకారం మహాపూజ పూర్తి చేశారు. 15 రోజుల పాటు జాతర ఉత్సవాలు కొనసాగుతాయి. మహాపూజకు జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఐటీడీఏ పాలక మండలి చైర్మన్ కనక లక్కేరావుకు తొడసం వంశీయులు సంప్రదాయం ప్రకారం తలపాగచుట్టి స్వాగతం పలికారు. అనంతరం ఖందేవునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాల్సిన బాధ్యత ఈతరం యువతపై ఉందన్నారు. ఆదివాసీ ఆలయాల అభివృద్ధికోసం ప్రత్యేక నిధుల కోసం ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, గ్రీన్ ఇండియా డైరెక్టర్ బాదావత్ పూర్ణచందర్, సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, ఎంపీటీసీ పరమేశ్వర్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కనక ప్రభాకర్, కార్యదర్శి మెస్రం మానిక్‌రావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'ఆగమ' పరీక్షలు



అర్చకులకు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదిలాబాద్: దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించిన ఆగమ(అర్చక) పరీక్షలు శనివారం ముగిశాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన వర, ప్రవర, ప్రవేశ పరీక్షలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 237 మంది అర్చకులు హాజరయ్యారు. 40 సంవత్సరాల లోపు వారికి రాత, మౌఖిక పరీక్షలు, ఆపై వారికి మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారి వివరాలు ఉన్నతస్థాయి అధికారులకు నివేదించనున్నట్లు దేవాదాయ ధర్మదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ ఎస్.నవీన్ కుమార్ వెల్లడించారు.

ఒడ్డెవాడలో ఒకరి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని ఒడ్డెవాడలో ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అల్లెపు నర్సయ్య ఇంట్లో భార్యతో గొడవపడ్డాడు. దీంతో అతని భార్య ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నర్సయ్యతో పాటు అతని కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన నర్సయ్య శనివారం ఇంటివద్ద గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖానాపూర్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యంకోసం నిర్మల్‌కు రెఫర్ చేశారు. కాగా పోలీసుల వేధింపుల వల్లే నర్సయ్య ఆత్మహత్యకు యత్నించాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎస్సైని వివరణ కోరగా ఆత్మహత్యాయత్నంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

10న సైన్స్ ఎగ్జిబిషన్

ఉట్నూర్: మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో ఉన్న పీఎమ్మార్సీ భవనంలో ఈ నెల 10న ఐటీడీఏ ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ విజయవంతం అయ్యేలా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

చీటింగ్ కేసులో ఒకరి అరెస్టు




వివరాలు వెల్లడిస్తున్న సీఐ అజయ్‌బాబు

ఖానాపూర్: ఖానాపూర్ సర్కిల్ పరిధిలోని కడెం, దస్తురాబాద్ మండలాల్లో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ సంస్థను మోసం చేసిన వినయ్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ అజయ్‌బాబు తెలిపారు. శనివారం పట్టణంలో ని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ సంస్థలో ఏజెంట్‌గా పనిచేస్తున్న వినయ్ వసూలు చేయగా వచ్చిన రూ.1,60,594ను తన సొంతా నికి వాడుకున్నాడని మేనేజర్ ఫిర్యాదు చేసిన ట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.70వేలు రికవరీ చేయడంతో పాటు మిగతా డబ్బుల ను చెల్లించాలని చెప్పినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై శంకర్, ఏఎస్సై రాంచందర్, సిబ్బంది రవికుమార్, రవినాయక్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

లోకేశ్వరం(ముథోల్): మండలంలోని బామ్నికేలో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. బామ్నికే శివారు ప్రాంతంలో ఉన్న మూడెకరాల భూమిపై గ్రామానికి చెందిన సుమలతకు, గడ్‌చాంద గ్రామానికి చెందిన కవితకు మధ్య కొంతకాలంగా భూవివాదం ఉంది. కవిత కోర్టు ద్వారా అట్టి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని పట్టా పాస్‌బుక్ పొందింది. నాకు ప్రాణహాని ఉందని కోర్టును ఆశ్రయించగా పోలీసు రక్షణ తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. శనివారం బామ్నికే శివారు ప్రాంతంలోని భూమి వద్ద పోలీసులు కవితకు రక్షణ కల్పించారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో మనస్తాపానికి గురైన సుమలత పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే పోలీసులు భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. సుమలతపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

వ్యక్తిగత కారణాలతో ఒకరిపై దాడి



గాయపడిన రాజలింగం

సారంగాపూర్(నిర్మల్): మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన ఉట్ల రాజలింగం (40)పై అదే గ్రామానికి చెందిన వాహిద్ సుత్తితో దాడిచేసి గాయపర్చాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు తన పనులు ముగించుకుని రాజలింగం ఇంటికి తిరిగి వస్తుండగా ఇదే గ్రామానికి చెందిన వాహీద్ వ్యక్తిగత కారణాలతో అతనిపై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయమై సారంగాపూర్ పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఫిర్యాదు అందితే సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దహెగాం(సిర్పూర్): మండలంలోని హత్తిని శివారులో శుక్రవారం రాత్రి పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు జరిపిన దాడుల్లో రూ.24,800 నగదు, ఐదు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట ఆడుతున్న జర్పుల కుమార్, ధరావత్ తిరుపతి, సుంకరి శ్రావన్‌కుమార్, పెద్దల సురేష్, చప్పిడె రవి, కార్నాతం అంజన్న, సోమిశెట్టి విఘ్నేష్, పుప్పాల నవీన్, రెడ్డి శ్రీను, మొర్లె పున్నంలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. గ్రామాల్లో ఏవరైనా పేకాట, కోడి పందాలు ఆడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కూలీలపై తేనెటీగల దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

భైంసాటౌన్(ముథోల్): మండలంలోని లింగి గ్రామంలో పత్తి ఏరేందుకు వెళ్లిన కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. మహారాష్ట్రకు చెందిన పలువురు కూలీలతో పాటు భైంసా పట్టణానికి చెందిన కూలీలు శనివారం పత్తి ఏరేందుకు వెళ్లారు. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో వలసకూలీలు సాగర, రమ, శాలిని, కుసుంబాయితో పాటు భైంసాలోని ఓవైసీనగర్‌కు చెందిన అజ్మీరా, ఆస్మా, సల్మా, అమీనా, నిషత్, వారి వెంట వెళ్లిన ఇద్దరు చిన్నారులు సోమేశ్, తల్హా లు గాయపడ్డారు. వారికి భైంసా ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు.

బైక్ పైనుంచి పడి వృద్ధురాలు మృతి

బెజ్జూర్(సిర్పూర్): బైక్ పైనుంచి కిందపడి వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మండలంలోని పాపన్నపేట గ్రామానికి చెందిన తొర్రెం మొండక్క(70) శుక్రవారం రాత్రి అదే గ్రామానికి చెందిన కిరణ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఎక్కి వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడడంతో వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందాలి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్(ఖానాపూర్): ఇంటర్ పూర్తి చేసిన గిరిజన బాలికలు గిరిజన సంక్షేమశాఖ ఆధీనంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందాలని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ప్రవేశానికి మార్చి 5న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు ఫిబ్రవరి 5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాలలో బీకాం కంప్యూటర్, బీఎస్సీ కంప్యూటర్, బీఎస్సీ (బీజెడ్‌సీ), బీఎస్సీ (ఎంపీసీఎస్) ఆంగ్లమాధ్యమంలో బోధన జరుగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

టైగర్‌జోన్‌ను సందర్శించిన డబ్ల్యూసీఎస్ డైరెక్టర్



రైతుతో మాట్లాడుతున్న డైరెక్టర్ విద్యాఆత్రేయ

కడెం: కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని కడెం, ఉడుంపూర్ అటవీ రేంజ్‌లను ‌వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్ సొసైటీ (ఇండియా)కంట్రి(డబ్ల్యూసీఎస్) డైరెక్టర్ విద్యా ఆత్రేయ, ఈస్టన్ ఘట్స్ ప్రోగ్రాం హెడ్ ఇమ్రాన్ సిద్ధిఖీతో కలిసి శనివారం సందర్శించారు. డబ్ల్యూసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ పండ్ల మొక్కల ప్లాంటేషన్ సందర్శించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూటీ మెంబర్ బెంజిమన్ క్లెమెంట్, హైటీకాస్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎనగందుల వెంకట్, సీపీఎఫ్ కోఆర్డినేటర్ రవికుమార్ పాల్గొన్నారు.

నాగోబా జాతర ఏర్పాట్లు ముమ్మరం



పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో కదం సురేశ్

ఇంద్రవెల్లి(ఖానాపూర్): పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 21న మెస్రం వంశీయుల మహా పూజలతో ప్రారంభం కానున్న నాగోబా జాతర ఏర్పాట్లు ముమ్మరం చేశారు. భక్తులు, మెస్రం వంశీయులకు సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేస్తున్నారు. ట్యాంక్‌ల వద్ద, నీటి నల్లల వద్ద పారిశుధ్యం లోపించకుండా ముందస్తుగా ఆర్‌సీసీ పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉట్నూర్ ఆర్డీవో కదం సురేశ్ శనివారం నాగోబా ఆలయాన్ని సందర్శించి జాతర ఏర్పాటు పనులను పర్యవేక్షించారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంజం సోము, సర్పంచ్ మెస్రం రేణుక నాగ్‌నాథ్, ఆయా శాఖల అధికారులు, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

చట్టాలపై పోలీసులకు అవగాహన



మాట్లాడుతున్న కిరణ్ కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కోర్టులోని ఏపీపీ కార్యాలయంలో శనివారం ఏపీ పీలు దేవేందర్, నవీన్ చట్టాలపై పోలీసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కిరణ్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. దరఖాస్తు తీసుకునే సమయంలో చేపట్టే విధానాలు, స్టేట్‌మెంట్ రికార్డు చేయడం, హాస్పిటల్‌కు పంపడం, డాక్టర్ ఇచ్చిన సర్టిఫికెట్ సమర్పించడం, సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టడం, నేరస్తులకు శిక్ష పడే విధంగా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పీపీలు సంజయ్‌కుమార్ వైరాగ్రే, రమణారెడ్డి, సీఐలు పురుషోత్తం చారి, సత్యనారాయణ, మల్లేశ్, నరేష్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఉట్నూర్ వైద్యుల పనితీరు భేష్

- ఆస్పత్రిలో తొలి సిజేరియన్ కాన్పు
- వైద్యులను అభినందించిన పీవో



బాలింతతో మాట్లాడుతున్న పీవో

ఉట్నూర్(ఖానాపూర్): ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో తొలి సిజేరియన్ కాన్పు విజయవంతం చేయడంలో వైద్యుల కృషి ఎంతో ఉందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులను అభినందించారు. శస్త్ర చికిత్సల వార్డును సందర్శించారు. కుమురంభీం జిల్లా వాంకిడి మండల కేంద్రానికి చెందిన బాలింత సోంబాయి, బిడ్డ ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇతర వసతుల కల్పనకు ఐటీడీఏ ద్వారా కృషి చేస్తామన్నారు. ఆస్పత్రికి వైద్యంకోసం వచ్చిన వారిని అత్యవసరమైతేనే ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఉపేందర్, వైద్యాధికారులు మహేందర్, మమత, నరేందర్, శ్వేత, సతీశ్, సిబ్బందిపాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు ప్రోత్సాహం?

బోథ్: డిగ్రీ పరీక్షల్లో కళాశాలలు మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిని నిజం చేస్తూ ఇప్పటివరకు ఆదిలాబాద్ జిల్లాలో 30 మంది విద్యార్థులు డిబార్ కావడం అనుమానాలకు తావిస్తోంది. కేయూ పరిధిలో ఇప్పటివరకు 34 మంది డిబార్ కాగా అందులో 30 మంది విద్యార్థులు ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన వారే కావడం గమనార్హం. వారిలో నేరడిగొండ మండలంలోని రెండు కేంద్రాల్లో 11 మంది, బజార్ హత్నూర్ మండలంలోని ఓ కళాశాల విద్యార్థులు ఈ కేంద్రంలో పరీక్ష రాస్తున్నారు. ఈ కళాశాల కేంద్రాన్ని కేవలం 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇచ్చోడలో వేయకుండా 23 కిలోమీటర్ల దూరంలో ఉన్న నేరడిగొండలో వేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. యూనివర్శిటీ అధికారులను మచ్చిక చేసుకుని అనుకూల కేంద్రాలను వేయించుకున్నట్లు తెలుస్తోంది.

15 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం డిగ్రీ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన పరీక్షలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ 15 మంది విద్యార్థులు డిబార్ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. ఉట్నూర్‌లోని పులాజీబాబా డిగ్రీ కళాశాలలో ఒకరు, అజ్మీర రేఖా శ్యామ్ డిగ్రీ కళాశాలలో ఆరుగురు, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నలుగురు, బెల్లంపల్లి భవిత డిగ్రీ కళాశాలలో ఒకరు, భైంసాలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు ఆయన పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా యువతి మృతి



దస్రుబాయి(ఫైల్)

పెంచికల్‌పేట్(సిర్పూర్): మండలంలోని కమ్మర్‌గాం గ్రామానికి చెందిన దుర్గం దస్రుబాయి(22) అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సదరు యువతి శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని పంట చేనుకు కావలా వెళ్లింది. మధ్యాహ్నం వరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా పంటచేనులో మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారంతో ఎస్సై విజయ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిర్పూర్(టి) ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. యువతి తల్లి శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

మృతిపై అనుమానాలు

దస్రుబాయి మృతి పట్ల తల్లి శకుంతల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పంట చేనుకు కాపలా వెళ్లిన తన కూతురును హత్య చేసి నోట్లో పురుగుల మందు పోసి ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. భూతగాదాల నేపథ్యంలో హత్య చేశారని నిందితులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్ లోఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి 44వ జూనియర్‌బాలుర హ్యాండ్‌బాల్ పోటీలను శనివారం జెడ్పీచైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ప్రారంభించారు. పోటీల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జీఎం ఆఫీస్ హెచ్‌వోడీ శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.